**రిపోర్టర్లు కావలెను**

ప్రకాశం జిల్లాలో 'జాతీయ వార్త' తెలుగు దినపత్రికలో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు సంప్రదించగలరు

9908862557

జాతీయ **వార్త**

తెలుగు దిన పత్రిక

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

# ప్రకాశం



**జిల్లా వార్తలు**





## ధర్మం వైపు నిలబడిన శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్‌కు..

# నా సలాం..!



- ఉభయ సభల్లో అమరావతి చట్టబద్ధత బిల్లు రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయం
- ప్రపంచ స్థాయిలోనే రాజధాని అమరావతి నిర్మాణం
- సీఎం చంద్రబాబుకు సహకరిద్దాం
- కందుకూరు నియోజకవర్గ ఐ టీడీపీ అధ్యక్షుడు షేక్ మున్న

**కందుకూరు, ఏప్రిల్ 3 (జాతీయ వార్త):** రాష్ట్ర రాజకీయాల్లో నిజాయితీ, ధర్మం, ప్రజాస్వామ్య విలువలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్. ఒత్తిళ్లు, బెదిరింపులు ఉన్నా కూడా నాడు మూడు రాజధానుల వికృత క్రీడను కౌన్సిల్‌లో చైర్మన్ షరీఫ్ అడ్డుకొనకపోయివుంటే నేటి పరిస్థితులు మరో రకంగా ఉండేది. శాసనమండలి చైర్మన్‌గా ఆయన వెనుకడుగు వేయకుండా ధర్మం వైపు నిలబడటం.. ప్రతి ప్రజాప్రతినిధికి ఆదర్శం. నాడు శాసనమండలిలో చైర్మన్‌గా ఉన్న షరీఫ్‌పై వైసీపీ ప్రజా ప్రతినిధులు వ్యక్తిగతంగా దాడులు చేయడం, అవమానకర వ్యాఖ్యలు చేయడం పూర్తిగా ఖండనీయమైనది. గతంలో శాసనమండలి వేదికగా తాను ఎదుర్కొన్న చేదు అనుభవాలను గుర్తు చేసుకుంటూ మాజీ శాసనమండలి చైర్మన్ ఎం.ఏ. షరీఫ్ భావోద్వేగానికి గురికావడం ముస్లిం సమాజంతో పాటు రాజకీయ వర్గాలను తీవ్రంగా కలిచివేసింది. ఇలాంటి ప్రవర్తనకు ఆంధ్ర రాష్ట్ర ప్రజలు వైసీపీకి 2024లో తగిన సమాధానం చెప్పారు. రాబోయే కాలంలో కూడా మూల్యం చెల్లించక తప్పదు. ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ ఉభయసభలు ఆమోదించటం రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయమని, పార్లమెంట్ లో అమరావతికి చట్టబద్ధత బిల్లుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షుడు షేక్ మున్న అన్నారు. నవ్యాంధ్రకు సమానమైన మహానగరాన్ని నిర్మించుకునే ఆవశ్యకతను గుర్తించి చంద్రబాబు అమరావతి రాజధాని నిర్మాణం చేపట్టారన్నారు. మొన్నటి వరకు మూడు ముక్కలాడిన వైయస్ జగన్ ఇప్పుడు ప్లాన్ బి అంటూ మరో కుట్ర పన్నుతున్నారని మున్న ఆరోపించారు.



## సెల్యూట్ షరీఫ్ సార్..!

వైకాపా హయాంలో మూడు రాజధానుల బిల్లు సమయంలో కెమెరాలు కట్ చేశాక జరిగిన పరిణామాలపై తొలిసా రి శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ మాట్లాడారు. నాడు ఓ మంత్రి నాపై చేయి చేసుకున్నారు. మరో మంత్రి నన్ను దూషిస్తూ.. నా పుట్టుకను నిందించారు. సిబ్బందిని నా దగ్గరకు రాకుండా వైకాపా సభ్యులు అడ్డుపడ్డారు. వైకాపా సభ్యులంతా నా మీదకు వచ్చారు. బెదిరింపులకు, ప్రలోభాలకు పాల్పడ్డారు. నా దగ్గర డబ్బు లేదు కాబట్టి.. బతుకుదెరువు చూపిస్తామని ప్రలోభ పెట్టారు. శాసనమండలినే రద్దు చేస్తామని బెదిరించారు. నాకున్న అధికారంతో 3 రాజధానుల బిల్లును ఆమోదించలేదు. ఎన్ని బెదిరింపులొచ్చినా.. ధర్మం వైపు నిలిచాను. ఇప్పుడు అమరావతిని రాజధానిగా చట్టం చేస్తుండటం సంతోషంగా ఉందని షరీఫ్ పేర్కొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక



ప్రకాశం

## రైతులు, మహిళల త్యాగ ఫలితమే
# రాజధానికి చట్టబద్ధత

* చట్టబద్ధతతో అమరావతికి రక్షణ
* రాజధానిలో క్వాంటం వ్యాలీ యువతకు పెద్ద ఆకర్షణ
* ఏపీ విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు



**కందుకూరు, ఏప్రిల్3 (జాతీయ వార్త):** అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా నిర్ణయిస్తూ పార్లమెంటు, రాజ్యసభలలో ఆమోదం పొందడం ఆంధ్రుల ఆత్మ గౌరవానికి ప్రతికని ఏపీ విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజధాని నిర్మాణం కోసం 29 వేల రైతులు 33 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగించడం గర్వించదగ్గ విషయమన్నారు. రైతుల త్యాగఫలితమే అమరావతి అని స్పష్టం చేశారు. వైకాపా ప్రభుత్వ పాలనలో రైతులను హింసకు గురిచేసారని, ఎన్నో ఆటంకాలు సృష్టించారన్నారు. పార్లమెంటు ఉభయ సభలలో వైకాపా ఎంపీలు అమరావతి బిల్లుకు వ్యతిరేకంగా వాకౌట్ చేసి చరిత్ర హీనులుగా మిగిలిపోయారని రాంబాబు తెలిపారు. ఇక అమరావతి నిర్మాణ పనులు చక చకా సాగిపోయి 2028 లో ప్రారంభోత్సవానికి సర్వాంగ సుందరంగా సిద్ధమవడం తెలుగు ప్రజల ఆకాంక్ష అని పేర్కొన్నారు. రాజధానిలో క్వాంటం వ్యాలీ యువతకు పెద్ద ఆకర్షణ అని అమరావతి దేశంలోనే అతి ముఖ్య మైన రాజధానిగా నిలవబోతుందని చెప్పారు. పోలవరం ప్రాజెక్ట్ కూడా నిర్ణీత సమయంలో పూర్తికానుందని, ఇక వైకాపా రాష్ట్రం నుండి వాకౌట్ అవ్వడం ఖాయమని జోస్యం చెప్పారు. రాజ్యాంగం తెలిసిన రాజ్యాంగ విలువలు తెలిసినవారు ఇక ఎన్నడూ రాజధాని మార్పు గురించి మాట్లాడితే ప్రజల్లో అభాసుపాలవుతారన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, ప్రాజెక్టులు, పరిశ్రమలు, పోర్టులు గురించి అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవుపలికారు. రాజధాని బిల్లుల ఆమోదం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి రాంబాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### దుష్టుల నుంచి అమరావతికి చట్టబద్ధత బిల్లు రక్షణ

**లింగసముద్రం, ఏప్రిల్ 3 (జాతీయ వార్త):** దుష్టుల నుంచి అమరావతి రాజధానికి రక్షణ కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లింగసముద్రం మండల ప్రధాన కార్యదర్శి అడపా రంగయ్య ధన్యవాదాలు తెలియజేశారు. పార్లమెంట్లో అమరావతి చట్టబద్ధ బిల్లుకు సహకరించిన పీఎం నరేంద్రమోడికి, కేంద్రమంత్రి అమిత్ షాకు ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో త్వరలో అద్భుత నగరం ఆవిష్కరణ కాబోతోందని తెలియ జేశారు. అదేవిధంగా అమరావతి ప్రాంత మహిళలు, రైతులు త్యాగాలు వృధా కాలేదని, జగన్ ఎన్ని జన్మలెత్తినా అమరావతిని టచ్ చేయలేరని అడపా రంగయ్య తెలియజేశారు.

## 11న ఆమరణ నిరాహార దీక్ష చేస్తా

* జేఏసీ చైర్మన్ మిరియం శ్రీనివాసులు



**ఉలవపాడు, ఏప్రిల్ 3 (జాతీయ వార్త):** ఈనెల 11వ తేదీ నాడు మంగళగిరి భారత చైతన్య యువజన పార్టీ కేంద్ర కార్యాలయంలో బీసీల సమస్యలపై భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ చేపడుతున్న ఆమరణ నిరాహార దీక్షకు 139 బీసీ కులాల జేఏసీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లుగా జేఏసీ చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్ర యాదవ్ చేపడుతున్న ఆమరణ నిరాహార దీక్ష మద్దతుగా నేను సైతం ఆమరణ నిరాహార దీక్ష చేపడతానన్నారు. బీసీలకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, 44 శాతం రిజర్వేషన్లను అన్ని రంగాలలో ఏర్పాటు చేయాలని, బీసీ కార్పొరేషన్లకు వెంటనే జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలని, రాజధాని అమరావతిలో బీసీలకు వెయ్యి ఎకరాలు భూమి కేటాయించాలని డిమాండ్ చేస్తూ రామచంద్ర యాదవ్ చేస్తున్న దీక్షకు బీసీల అభివృద్ధి కోరుకునేటువంటి ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు పరచాలని 79 సంవత్సరాలుగా దగా చేస్తున్న బీసీలకు మేలు జరగాలని, న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని శాంతియుతంగా చేపడుతున్న దీక్షకు ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. 50 శాతంగా ఉన్నటువంటి బీసీలకు అన్ని రంగాలలో అన్యాయం జరుగుతుందని ఇది గమనించిన రామచంద్ర యాదవ్ గొప్ప నిర్ణయంతో ఆమరణ నిరాహార దీక్ష చేయడం న్యాయమైనదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే బీసీల డిమాండ్లపై స్పందించి న్యాయం చేయాలని లేని పక్షంలో ఉద్యమ రాష్ట్రవ్యాప్తంగా చేపడతామని శ్రీనివాసులు తెలిపారు.




# ఉన్నా.. లేనట్టే!

* శిథిలావస్థకు చేరిన పలు ప్రభుత్వ భవనాలు
* నిరుపయోగంగా మరికొన్ని
* ప్రారంభానికి నోచుకోని ఇంకొన్ని
* సగంలో నిలిచిన పలు నిర్మాణాలు
* ఊరికి దూరంగా చాలా భవనాలు
* వినియోగంలోకి వచ్చేలా చూడాలంటున్న మండలవాసులు




**లింగసముద్రం, ఏప్రిల్ 3 (జాతీయ వార్త):** వైసిపి ప్రభుత్వంలో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు గ్రామాలలో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గ్రామాలలో సచివాలయం వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన పేరుతో అప్పటి ప్రభుత్వంలో భవనాలను నిర్మించారు. వాటిల్లో కొన్ని భవనాలు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. మరి కొన్ని భవనాలు ప్రారంభానికి కూడా నోచుకోలేదు. ఇంకొన్ని భవనాలు నిర్మాణ దశలోనే ఆగిపోయాయి. లింగసముద్రం మండలంలో మొత్తం 16 పంచాయతీలు ఉండగా 13 సచివాలయాలు నిర్మించారు. వాటిల్లో మాలకొండరాయుని పాలెం గ్రామంలోని సచివాలయం నిర్మాణం పూర్తికాక మధ్యలోనే ఆగిపోయింది. మిగిలిన సచివాలయాలు పూర్తయ్యాయి. నిర్మాణం పూర్తి అయ్యి ప్రారంభించుకున్నప్పటికీ మొగిలిచర్ల సచివాలయం పంచాయతీ ఆఫీసులోని కొనసాగుతుంది. గ్రామానికి సుమారు ఒకటిన్నర కిలోమీటర్ దూరంలో సచివాలయ నిర్మాణాన్ని చేపట్టడం, విద్యుత్ సౌకర్యం లేకపోవడం వల్ల నూతన సచివాలయంలోకి వెళ్లకుండా పంచాయతీ కార్యాలయంలోని విధులు కొనసాగిస్తున్నారు. మండలంలో రైతు భరోసా కేంద్రాలు 13 మంజూరు కాగా వాటిల్లో 12 పూర్తయ్యాయి. మాలకొండరాయునిపాలెం రైతు భరోసా కేంద్రం నిర్మాణ దశలోనే నిలిచిపోయింది. లింగసముద్రం పెద్దపవని గ్రామాలలో రెండు రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి వాటిల్లో ఒకటి మాత్రమే వినియోగిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. హెల్త్ క్లినిక్ సెంటర్లను మండలంలో 11 నిర్మించారు. వాటిల్లో కొన్ని మాత్రమే వినియోగంలో ఉన్నాయి. మిగిలిన హెల్త్ క్లినిక్ సెంటర్లను తలుపులు తెరిచిన పాపాన కూడా పోలేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో అందరికీ వైద్యం అందుబాటులో ఉండాలని ఉద్దేశంతో నిర్మించిన హెల్త్ క్లినిక్ సెంటర్లు ఉపయోగంలో లేకపోవడం వల్ల వైద్యం కొరకు ప్రైవేటు వైద్యశాలను ఆశ్రయించాల్సిన దుస్థితి గ్రామాల్లో ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మండలంలో 13 మిల్క్ సెంటర్లు మంజూరు కావడం జరిగింది. వాటిలో ఆరు పాల కేంద్రాల నిర్మాణం పూర్తయింది. మరో ఏడు పాల కేంద్రాలు నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి. పూర్తయిన పాల కేంద్రాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వాటిని ఉపయోగంలోకి తీసుకురావడంలో అధికారులు కూడా చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అదేవిధంగా డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేసి అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని ఉద్దేశంతో మండలంలో డిజిటల్ లైబ్రరీలను నిర్మించడం జరిగింది. నిర్మాణం పూర్తయి ప్రారంభం జరిగినప్పటికీ వాటిల్లో ఎలాంటి కార్యకలాపాలు జరగడం లేదు. పేరుకే భవనాలు నిర్మించారు తప్ప ప్రజలకు ఉపయోగపడే విధంగా ఎక్కడా కూడా పనిచేయడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కొన్ని ప్రభుత్వ భవనాలను ఊరికి దూరంగా నిర్మించడం వల్ల వాటిని తెరిచేందుకు సిబ్బంది సుముఖత చూపడం లేదు. అంతేకాకుండా ఊరికి దూరంగా ఉండటంవల్ల ప్రజలు కూడా అక్కడికి వెళ్లి ప్రభుత్వ సేవలు అందుకునేందుకు సిద్ధంగా లేరు.

### ప్రభుత్వ భవనాల్లో దొంగల హల్ చల్

ప్రభుత్వ భవనాలను వినియోగంలోనికి తీసుకురాకపోవడం, ఊరికి దూరంగా ఉండడం వల్ల దొంగలు హల్ చల్ చేస్తున్నారు. రాత్రి సమయాలలో ప్రభుత్వ భవనాల తాళాలను పగలకొట్టి అందులో ఉన్న విలువైన సామగ్రిని దోచుకెళ్తున్నారు. ఇటీవల కాలంలో పెంట్రాల పంచాయతీలో ఒకే చోట ఉన్న నాలుగు ప్రభుత్వ భవనాల తాళాలను పగలగొట్టి గుర్తు తెలియని దొంగలు అందులో ఉన్న ఫ్యాన్లు, లైట్లు, ఇతర సామాగ్రిని దొంగిలించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా చేయడం జరిగింది.

### అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా..

గ్రామాలలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను కొందరు వ్యక్తులు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా ఏర్పాటు చేసుకొని వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రాత్రి వేళల్లో మద్యం సేవించడంతోపాటు అసాంఘిక కార్యక్రమాలకు తెరలేపుతున్నారు. నిత్యం గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భవనాల వద్ద గ్రామాల్లోని కొందరు, వారితోపాటు ఇతర గ్రామాల నుండి వచ్చినా వారు అక్కడ మద్యం సేవించడం వంటి పనులు చేస్తున్నారు. ప్రభుత్వ భవనాలలో ఎలాంటి కార్యకలాపాలు జరగకపోవడం, ముఖ్యంగా కొన్ని గ్రామాలలో ప్రభుత్వ భవనాలు ఊరికి దూరంగా ఉండటం వల్ల ఆకతాయిలు ఇంకా రెచ్చిపోతున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగంలోనికి తీసుకువచ్చి ప్రజలకు అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని, నిర్మాణంలో ఉన్న వాటిని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546